క్లుప్తంగా

ఇంటర్ పరీక్షకు 325 మంది విద్యార్థులు హాజరు



రాజవొమ్మంగిలోని పరీక్షా కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంగా గురువారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ మ్యాథ్స్–ఏ1, బోటనీ, సివిక్స్ పరీక్షలు జరిగాయి. మండలంలోని మూడు కళాశాలల నుంచి మొత్తం 341 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 325 మంది మాత్రమే హాజరై పరీక్ష రాసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ సంతోషికుమారి తెలిపారు. 16 మంది ఈ పరీక్షకు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్

జి.మాడుగుల: మండలంలో సుర్మతి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. జి.మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన సంభవించే వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తితే వెంటనే పీహెచ్‌సీలను సంప్రదించాలని ఆయన సూచించారు. హెచ్‌ఎం శ్యామసుందరం తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత టీడీపీకి లేదు'



పండా రామకృష్ణదొర

రంపచోడవరం: రంపచోడవరం మండల టీడీపీ అధ్యక్షుడు కారం సురేష్‌బాబుకు వైఎస్సార్‌సీపీ గురించి మాట్లాడే అర్హత లేదని రంపచోడవరం వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పండా రామకృష్ణదొర అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాసన సభలో ప్రతిపక్షానికి విలువ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం డబ్బా కొట్టుకోవడంతో ప్రజలకు న్యాయం ఏమీ జరుగుతుందన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ప్రారంభమైందని, ఇందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు నిదర్శనమన్నారు.

వర్మీకంపోస్టు యార్డుల పరిశీలన



తమ్మంగులలో సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

చింతపల్లి: మండలంలోని తమ్మంగుల, అన్నవరం పంచాయతీల్లో ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం పర్యటించారు. గ్రామాల్లో సంపద కేంద్రాలను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను సంపద కేంద్రాలకు తరలించడంతో పాటు వాటిని సమర్థంగా వినియోగించి సేంద్రియ ఎరువులుగా తయారు చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లోనూ ఘన సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకువస్తున్నామన్నారు. అనంతరం అన్నవరం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సర్వే పనులు వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

వద్దాదిలో ఘనంగా మోదకొండమ్మ పండగ

బుచ్చెయ్యపేట: మండలంలో వద్దాది మేజర్ పంచాయతీలో గ్రామదేవత మోదకొండమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే అమ్మవారి పండగ ఆఖరి రోజు గురువారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయింత్రం డప్పులు, వాద్యాలు, నేల డ్యాన్స్, భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత మధ్యన అమ్మవారి తిరునాళ్ల ఊరేగింపు సాగింది. రాత్రికి వద్దాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి. పలువురు నాయకులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రామాల్లో దాహం కేకలు



బాలరేవులలో నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

నిరుపయోగంగా తాగునీటి పథకాలు

చింతపల్లి: మండలంలోని పెదబరడ పంచాయతీ చింతలూరు, పెదబరడ, లోతుగెడ్డ జంక్షన్‌తో పాటు లంబసింగి పంచాయతీ లబ్బంగి, కొత్తవీధి, తాజంగి పంచాయతీలో పంచాయతీ కేంద్రంలో ఉన్న ఐదు వీధులతో పాటు లమడంపల్లి, లోతుగెడ్డ పంచాయతీ చెరుకుంపాకలు పాతవీధి, తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. బోర్లు పనిచేయడం లేదు. మంచి నీటి పథకాల నిరుపయోగంగా ఉన్నాయి. పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా సక్రమంగ జరగడం లేదు. ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నారు.

బాలరేవులలో తాగునీటి ఎద్దడి

30 గ్రామాలకు అందని తాగునీరు

అల్లాడుతున్న గిరిజనులు

పట్టించుకోని అధికారులు

కొయ్యూరు: మన్యంలో మారుమూల గ్రామాలు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నాయి. కొన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అక్కడ బోర్లు వేసేందుకు పెద్ద వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. నీటి కోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డలను ఆశ్రయిస్తున్నారు. మండుటెండలో కాలినడకన దూరంలో ఉన్న ఊటగెడ్డల నీటిని పట్టుకుని వస్తున్నారు. కలుషిత నీటి వినియోగంతో అమాయక గిరిజనులు రోగాల బారిన పడుతున్నారు.



కొండపై ఉన్న ట్యాంకు నుంచి నీటిని సేకరిస్తున్న గ్రామస్తులు

నాడు సమస్య లేకుండా చర్యలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వేసవికి ముందుగానే తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, పాడైన బోర్లు, నీటి పథకాల మరమ్మతు పనులు జరిగేవి. ఇందుకోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. శివారు గ్రామాలకు కూడా పైపులైన్‌తో ఇంటింటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా జరిగింది.. మరిన్ని గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా చేయాల్సిన పనులకు నిధులు మంజూరయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలలు పైబడినా నేటి వరకు మన్యంలో ఏ గ్రామంలోనూ ఎటువంటి అభివృద్ధి పని చేయలేదు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వినియోగంచలేదు. గ్రామాల్లో తాగునీటి సమస్య తాండవిస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం.. గిరిజనుల పాలిట శాపంగా మారింది.

గెడ్డనీరే శరణ్యం

బూదరాళ్ల పంచాయతీ బాలరేవులలో గడచిన కొన్ని నెలలుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. మోటారు పాడైపోవడంతో మరలా గెడ్డలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో 30కి పైగా గ్రామాల్లో తాగునీటి సమస్య తాండవిస్తోంది. వారంతా ఏడాది పాటున గెడ్డలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని గ్రామాలు కొండలపై ఉండడంతో అక్కడకు భారీ వాహనాలు వెళ్లేందుకు ఆస్కారం లేదు. ఈ కారణంగా తాగునీటి అవస్థలు తప్పడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. యూ.చీడిపాలెం, ఎం.భీమవరం, బూదరాళ్ల పంచాయతీల్లో తాగునీటి సమస్యతో గిరిజనులు అల్లాడిపోతున్నారు.



గెడ్డనీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

అధికారులు స్పందించాలి

మా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. సమీపంలో గెడ్డనే ఆశ్రయిస్తున్నాం. కొద్ది రోజుల కిందట ఇక్కడున్న ట్యాంకుకు మోటారు అమర్చారు. అయితే అది పాడై పనిచేయకపోవడంతో మరలా తాగునీటి సమస్య వేధిస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– లక్ష్మణ్, బాలరేవుల

ఇబ్బందులు తప్పడం లేదు

చెంతనే కాలువ ఉన్నా తాగునీటి సమస్య తప్పడం లేదు. కాలువ నుంచి నీరు తీసుకురావడం ఇబ్బందిగా మారింది. వెంటనే చర్యలు తీసుకుని మోటారును బాగు చేయాలి. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి. – లక్ష్మి, బాలరేవుల

కూతవేటు దూరంలోనే సమస్య

బూదరాళ్ల పంచాయతీ బాలరేవులలో తాగునీటి సమస్య ఎప్పట్నుంచో వెంటాడుతుంది. నెల కిందట తాగునీటి సమస్యను నివారించేందుకు ఏర్పాటు చేసిన మోటారు పాడై నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామస్తులు సమీపంలోని ఊటగెడ్డలనే ఆశ్రయిస్తున్నారు. గతంలో ఇక్కడ పోలీసులు కూడా తాగునీటికి ట్యాంకును ఏర్పాటు చేశారు. అది కూడా పనిచేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తక్షణ చర్యలు తీసుకుంటాం

బాలరేవులలో అమర్చిన మోటారు పనిచేయడం లేనట్టు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుని మోటారును బాగు చేయిస్తాం. మండలంలోని 30 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– సాయి, ఆర్‌డబ్ల్యూఎస్, జేఈ

పోలీసు చట్టాలపై అవగాహన



జి.మాడుగుల పోలీస్ స్టేషన్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు



దుంబ్రిగుడల విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పాపినాయుడు

జి.మాడుగుల: పోలీసుల విధులు, చట్టాలు, కేసులు, ఆయుధాలు గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు. స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు తుపాకులు, తదితర ఆయుధాల గురించి వారు వివరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ కీలకమని వారు చెప్పారు. ప్రత్యేక మహిళా చట్టాలపై అవగాహన ఉండాలని వారు సూచించారు.

దుంబ్రిగుడ: శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సంరక్షణే లక్ష్యంతో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని ఎస్‌ఐ కె.పాపినాయుడు అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని పోలీసు స్టేషనల్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికు కేజీబీవీ విద్యార్థినులకు పోలీసు చట్టాలు, విధులు, ఆయుధాల పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో పురుషులతో సమానంగా మహళలు ఎదగాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వాలు పోలీసు, న్యాయ వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. విద్యార్థి దశలోని చట్టాలు, హక్కులపై అవగహన కలిగి ఉన్నత చదువులకు తోడ్పాటు కావాలని ఆయన కోరారు. విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఎటపాక: మండలంలోని లక్ష్మీదేవిపేటలోని పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ మహిళా కమిటీ అధ్యక్షురాలు గంగాభవాని మాట్లాడుతూ ఈనెల 8 ప్రపంచ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మండల కేంద్రంలోని విద్యా శాఖ కార్యాలయంలో నిర్వహించనున్న మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ శాఖల మహిళా సిబ్బంది హాజరుకావాలని కోరారు. సమావేశంలో పుల్లమ్మ, తులసి, రజిని, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫేర్‌వెల్



చిన్నారుల నృత్యం

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఫేర్‌వెల్ డే సందడిగా జరిగింది. పాఠశాల ఆవరణలో జరిగిన సభలో హెచ్‌ఎం గోపాలకృష్ణ మాట్లాడుతు ప్రతి ఒక్కరు శ్రద్ధగా చదివి పాఠశాలలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు హాజరై సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

'పది' పరీక్షలకు 337 మంది విద్యార్థులు



విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

అడ్డతీగల: ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అడ్డతీగల మండలంలో 10 ఉన్నత పాఠశాలల నుంచి 337 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలల వారీగా విద్యార్థుల వివరాలను ఆయన వెల్లడించారు. అడ్డతీగల గురుకుల పాఠశాల నుంచి– 72 మంది, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల– 84 మంది, బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల–17 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల–30 మంది బాలురు, 20–బాలికలు, డి.భీమవరం బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల–29 మంది, వీరవరం బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల –18 మంది, గొంటువానిపాలెం జెడ్పీహెచ్‌ఎస్–15 బాలురు, 31–మంది బాలికలు, రాయపల్లి జెడ్పీ హెచ్‌ఎస్ –17 బాలురు, ఒకరు–బాలికలు, ఎల్లవరం జెడ్పీహెచ్‌ఎస్–16 మంది బాలురు, 14–మంది బాలికలు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేస్తున్నట్టు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలల వారీగా ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్ని సబ్జెక్టులతో ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారన్నారు.విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

వెతలు తీరేనా?

- ఆశ్రమ పాఠశాలలకు బియ్యం కొరత
- వార్డెన్లు, నిర్వాహకుల అవస్థలు

పెదబయలు: మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు గిరిజన సహకార సంస్థ నుంచి అందించే బియ్యం సక్రమంగా అందించకపోవడంతో ఆశ్రమ పాఠశాలల హెచ్‌డబ్ల్యూవోలు, డిప్యూటీ వార్డన్లు అవస్థలు పడుతున్నారు. పెదబయలు మండలంలోని 11 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మెనుకు సంబంధించి బియ్యం పెదబయలు జీసీసీ గోదాము నుంచి సక్రమంగా సరపరా చేయడం లేదని వార్డన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు 250 నుంచి 550 మంది విద్యార్థుల వరకు ఆహారం అందించడానికి బియ్యం అవసరం అవుతుందని 350 మంది పిల్లలు ఉన్న పాఠశాలలో నెలకు 100 బస్తాలు పైబడి ఇవ్వాల్సి ఉందని అయితే సక్రమంగా జీసీసీ నుంచి అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీంతో పక్క పాఠశాలల నుంచి అప్పు తెచ్చుకుని విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నామని, వారికి తిరిగి ఇవ్వడానికి బియ్యం లేకుండా పోతుందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలలకు ఇన్‌డెంట్ ప్రకారం బియ్యం ఫుల్ స్టాకు అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఉప గిరిజన సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలతను వివరణ కోరగా గత నెల 25, 26 తేదీల్లో పాఠశాలలకు అందించాల్సిన బియ్యం ఇన్‌డెంట్ జీసీసీకి అందించడం జరిగిందని, ప్రతీ నెల 2తేది లోపు పాఠశాలలకు బియ్యం అందించాల్సి ఉందన్నారు. కాని ఆశ్రమాలకు బియ్యం వేయడం లేదు.అన్ని ఆశ్రమాల్లో బియ్యం కొరత ఉంది.స్థానిక జీసీసీ మేనేజర్ గాసీని వివరణ కోరగా విశాఖపట్నం గోదాము నుంచి బియ్యం పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదన్నారు. మండలంలో 9 డిపోలకు ఈ నెలకు సంబంధించిన బియ్యం ఇంకా సరఫరా కాలేదని, ఈ విషయం పాడేరు జీసీసీ డీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. బియ్యం లోడు వస్తే అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తామన్నారు. అధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలలకు బియ్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని వార్డన్లు కోరుతున్నారు.

పింఛన్ల కోసం వినతి



పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న వృద్ధులు, వితంతువులు, సీపీఎం నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీకి చెందిన వయోవృద్ధులు, వితంతులకు పింఛన్లు పునరుద్ధరించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని కర్రిముఖిపుట్టు పంచాయతీ కార్యదర్శిను గురువారం సీపీఎం నేతలు, వితంతువులు, వయోవృద్ధులు వినతి పత్రం అందించారు. పింఛన్ల అందించాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు భీమరాజు, లైకోన్‌లు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భర్త చనిపోతే భార్యకు ఒక నెల రోజుల్లోనే వితంతు పింఛన్ ఇచ్చేవారని, కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఒక వితంతువు పింఛను కూడా ఇవ్వలేదన్నారు. దీంతో అర్హులైన ఉండి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అర్హులైన పింఛన్‌దారులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: మండలంలోని రేవళ్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పిల్లి సత్యనారాయణ కుటుంబాన్ని ఎంపీపీ బడుగు రమేష్, నాయకులు గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీపీ బడుగు రమేష్ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు మనో ధైర్యం కల్పించారు. ప్రభుత్వం నుంచి రావలసిన రాయితీలను అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. ఉప సర్పంచ్ నాగేంద్ర, నాయకులు కుశల, మాజీ సర్పంచ్ కొండపల్లి దేముడు, మట్టపర్తి రాజు తదితరులున్నారు.

మహిళలకు ఆటల పోటీలు



ఆటలాడుతున్న మహిళలు

దుంబ్రిగుడ: జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యూజికల్ చైర్స్, కబడ్డీ, ఖోఖో ఆటలను ఆడించారు. అనంతరం సీడీపీవో నీలిమ ఎంపీడీవో కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ పంచాయతీ, గ్రామాల్లో మహిళ పోలీసు కన్వీనర్‌గా 9 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటుచేసుకోవాలన్నారు. వారు మహిళా చట్టాలు, బాల్య వివాహాల అనర్థాలు తదితర విషయాలను గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, మహిళ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి



గ్రామస్తులకు ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

పాడేరు రూరల్: గ్రామల్లో సారా, మద్యం దుకాణాల నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కృషి చేస్తుందని పాడేరు ఎక్సైజ్ శాఖ సీఐ ఆచారి తెలిపారు. మండలంలో అల్లివరం, జోడిమామిడి, కాంట్రంగిపాడు, గ్రామల్లో సారా, మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. గ్రామస్తులచే సారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా, మద్య పానం అనర్థాలపై కళాజాత ద్వారా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సారా తయారుచేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



విద్యార్థినులకు పరీక్ష అట్టలు ,పెన్నులు అందజేస్తున్న మాజీమంత్రి బాలరాజు, డాక్టర్ సురేష్‌కుమార్

జి.మాడుగుల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, వైఎస్సార్–టీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ తెడబరికి సురేష్ కుమార్ ఆకాంక్షించారు. మండలంలోని గాంధీ నగరం గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు గురువారం పరీక్ష అట్టలు, పెన్ను(స్టేషనరీ) అందజేశారు. వారు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థినులు ఒత్తిడికి గురికాకుండా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. విద్యార్థుల ఉన్నత విద్య లక్ష్యంతో కష్టపడి, ఇష్టపడి చదివి అధిక మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని వారు సూచించారు. మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, హెచ్‌ఎం సుభద్రమ్మ, ఉపాధ్యాయులు తెల్లబాబు, విజయకుమారి, కృష్ణకుమారి, గ్రామపెద్ద మత్స్యరాస రామరాజు తదితరలు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు టార్పాలిన్లు



గిరిజన రైతులకు టార్పాలిన్లు అందజేస్తున్న చింతపల్లి జీసీసీ డీఎం దేవరాజ్

చింతపల్లి: గిరిజన సహకార సంస్థకు కాఫీవిక్రయించే గిరిజన రైతులకు ప్రోత్సాహకంగా ఉచితంగా టార్పాలిన్లను పంపిణీ చేస్తున్నట్టు చింతపల్లి జీసీసీ డివిజన్ మేనేజరు దేవరాజ్ అన్నారు. మండలంలోని చిన్నయ్యపాలెం, గూనాలంక గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు.ఈ ఏడాది తమ జీసీసీకి కాఫీని విక్రయించిన రైతులను ప్రత్యేకంగా గుర్తించి వారికి ఉచితంగా టార్పాలిన్లను అందజేస్తున్నట్టు తెలిపారు.అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ ఏడాది కాఫీకి మంచి ధరలు లభిస్తున్నాయన్నారు. వ్యాపారుల మధ్య తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ జీసీసీపై ఉన్న నమ్మకంతో తమ సంస్థకు సరకు విక్రయించిన రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్టు డీఎం దేవరాజ్ తెలిపారు.